సాక్షి
మహబూబాబాద్
బుధవారం । 11 । జూన్ । 2025



క్రీడా పాఠశాల పిలుస్తోంది..

రాష్ట్రంలోని మూడు క్రీడా పాఠశాలల్లో ఈ విద్యా సంవత్సరానికి గాను 4వ తరగతిలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. తేదీల వారీగా ఎంపిక పోటీలు నిర్వహించనున్నారు. - 8లో▸



సమస్యల అంతానికి పరిశోధనే ఆయుధం - 8లో▸

సామాజిక సమస్యల పరిష్కారానికి పరిశోధనే ఆయుధమని కాకతీయ యూనివర్సిటీ వీసీ ప్రతాప్‌రెడ్డి తెలిపారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం 36.1°/24.6°

జిల్లాలో వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

స్పీకర్‌ను కలిసిన డిప్యూటీ స్పీకర్



మరిపెడ రూరల్: తెలంగాణ శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను నూతనంగా ఎన్నికైన డిప్యూటీ స్పీకర్ జాటోతు రాంచంద్రునాయక్ హైదరాబాద్‌లోని శాసన సభ కార్యాలయంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్పీకర్‌ను శాలువాతో సత్కరించారు. అలాగే ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో పాటు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు.

'భూభారతి'తో రైతుల సమస్యలు పరిష్కారం

● అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో



కురవి: ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న భూ భారతి చట్టంతో రైతుల సమస్యలు పరిష్కారం అవుతాయని అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో రెవెన్యూ సదస్సును సందర్శించి, దరఖాస్తులను పరిశీలించారు. రైతుల నుంచి వచ్చే దరఖాస్తులన్నీ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో లాభాలు



గార్ల: ఆయిల్‌పామ్ తోటల సాగుతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని జిల్లా ఉద్యాన శాఖ అధికారి జినుగు మరియన్న అన్నారు. మంగళవారం గార్ల రైతు వేదికలో జరిగిన రైతు సదస్సులో ఆయన మాట్లాడారు. రైతులు ప్రతీఏటా మూస పద్ధతిలో ఒకే పంట సాగు చేయకుండా పంటమార్పిడి విధానం అవలంబిస్తే పంటలకు చీడపీడల నివారించడంతో పాటు, భూసారం వృద్ధి చెందుతుందన్నారు. ప్రస్తుతం ఆయిల్‌పామ్ పంట టన్నుకు మార్కెట్‌లో రూ.20,000 ధర ఉందని, ఈ పంట ద్వారా ఏడాదికి ఎకరాకు రూ.లక్ష ఆదాయం లభిస్తుందని అన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీని రైతులు సద్వినియోగం చేసుకొని పంట సాగు చేసుకోవాలన్నారు. సదస్సులో ఏఓ కావటి రామారావు, మహబూబాబాద్, డోర్నకల్ హెచ్‌ఓలు శాంతిప్రియ, ప్రియ, హెచ్‌ఈఓలు కిరణ్, రాజ్యలక్ష్మి, పూజిత, మేఘన, రైతులు పాల్గొన్నారు.

ఫైర్ స్టేషన్ నిర్మాణానికి భూమి అప్పగింత

డోర్నకల్: డోర్నకల్‌లో ఫైర్ స్టేషన్ నిర్మాణానికి అవసరమైన భూమిని మంగళవారం రెవెన్యూ అధికారులు ఫైర్ స్టేషన్ అధికారులకు అప్పగించారు. అమ్మపాలెం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 4లో సుమారు 11గుంటల భూమిని ఫైర్ స్టేషన్ నిర్మాణం కోసం తహసీల్దార్ ఇమ్మానియల్ ఆధ్వర్యంలో ఫైర్ స్టేషన్ అధికారి వీరేశ్‌కు అప్పగించారు. భవన నిర్మాణం కోసం రూ.1.39 కోట్ల నిధులు మంజూరు కాగా త్వరలోనే పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. కార్యక్రమంలో ఆర్‌ఐ యాసీన్, సర్వేయర్ వెంకన్న పాల్గొన్నారు. అనంతరం డీఎఫ్‌ఓ శ్రీనాథ్ ఫైర్ స్టేషన్ కోసం కేటాయించిన భూమిని పరిశీలించారు.

వ్యాధుల నివారణకు జాగ్రత్తలు చేపట్టాలి

నెహ్రూసెంటర్: సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓ రవిరాథోడ్ సూచించారు. డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో మంగళవారం సబ్ యూనిట్ ఆఫీసర్లు, ఆరోగ్య సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. డెంగీ, మలేరియా, వైరల్ ఫీవర్, టైఫాయిడ్ జ్వరాల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. మండలాల్లో ఇంటింటికీ ఆరోగ్య సిబ్బంది వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పరిసరాల పరిశుభ్రత, నీరు నిల్వలేకుండా చూడాలని, దోమ కాటుకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఆయా మండలాల వైద్యాధికారులు వారానికి రెండు నివేదికలు పంపించాలని, అత్యవసర పరిస్థితుల్లో స్పందించేలా రెస్పాన్స్ టీం సిద్ధంగా ఉండాలన్నారు. ప్రోగ్రాం అధికారి సుధీర్‌రెడ్డి, సబ్ యూనిట్ ఆఫీసర్లు వడ్డెబోయిన శ్రీనివాస్, రామకృష్ణ, హెచ్‌ఈఓ స్వామి, పురుషోత్తం, కేవీ రాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మార్పుతోనే మనుగడ!

జిల్లాలోని మొత్తం సాగు భూమి: 4.50లక్షల ఎకరాలు

ఎర్ర నేలలు : 2.34లక్షల ఎకరాలు(52శాతం)

నల్లరేగడి నేలలు : 2.16లక్షల ఎకరాలు(48శాతం)

జిల్లాలోని నేలల్లో పోషకాల వివరాలు (హెక్టార్‌కు కిలోలు)

పోషకాలు	ఉండాల్సినమోతాదు	ప్రస్తుత పరిస్థితి
నత్రజని	200 నుంచి 250 కేజీలు	120 కేజీలు
భాస్వరం	30 నుంచి 35 కేజీలు	300 కేజీలు
పొటాష్	200 నుంచి 270 కేజీలు	180 కేజీలు



జిల్లా నేలల్లో పోషకాల భేదం

● ఎక్కువ రసాయన ఎరువుల వాడకంతో సారం కోల్పోతున్న భూములు
● ఏ పంట వేసినా.. దిగుబడులు అంతంతే
● సాగు పద్ధతుల్లో మార్పు అనివార్యం

సాక్షి, మహబూబాబాద్: వడ్రంగికి కలప స్వభావం తెలియాలి. ఉపాధ్యాయుడికి విద్యార్థి స్వభావం, డాక్టర్‌కు రోగి స్వభావం తెలియాలి. అప్పుడే వారివారి వృత్తుల్లో రాణిస్తారు. అలాగే రైతుకు నేల స్వభావం తెలియాలి. లేకపోతే ఏ పంట వేసినా నష్టపోతాడు. జిల్లాలో విచ్చలవిడిగా ఎరువులు, క్రిమి సంహారక మందులు వాడడం, పంట మార్పిడి చేయకపోవడం మొదలైన కారణాలతో భూమిలో ఉండే ఖనిజ లవణాల సమతుల్యత దెబ్బతిని భూములు సారం కోల్పోతున్నాయి. కాగా, సాగు పద్ధతుల్లో మార్పు, పంట మార్పిడి, భూసార పరీక్షల ద్వారా అనువైన పంటలు సాగు చేస్తేనే ఆశించిన స్థాయిలో దిగుబడి వస్తుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు తెలుపుతున్నారు.

దెబ్బతిన్న నేలల సమతుల్యత

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత సాగునీటి వసతులు పెరిగాయి. దీంతో జిల్లాలో అప్పటి వరకు 3లక్షల మేరకు ఉన్న సాగు భూమి విస్తీర్ణం 4.50లక్షల ఎకరాలకు చేరింది. ఇందులో 2.34లక్షల ఎకరాలు(52శాతం) ఎర్ర నేలలు(ఎర్రచెక్క, దుబ్బ, చౌడు, ఇసుక), 2.16లక్షల ఎకరాలు(48శాతం) నల్లరేగడి నేలలు(నల్లరేగడి, బంక, జిగురు) ఉంటాయి. అయితే వ్యవసాయశాస్త్ర వేత్తలు చెప్పిన వివరాల ప్రకారం పోషకాలు ప్రతీ 2.5ఎకరాలు(హెక్టారు) నేలలో 20 సెంటీమీటర్ల లోతు వరకు నాలుగైదు చోట్ల మట్టిని తీసి పోషకాలను లెక్కిస్తారు. దీని ప్రకారం నత్రజని 200నుంచి 250 కేజీల వరకు ఉండాలి. కానీ ప్రస్తుతం 120 కేజీలు మాత్రమే ఉంది. భాస్వరం 30 నుంచి 35 కేజీల వరకు మాత్రమే ఉండాలి. కానీ ప్రస్తుతం 300 కేజీలకు పైగా ఉంది. దీంతో పాటు పొటాష్ 200 నుంచి 270 కేజీల వరకు ఉండాలి. ప్రస్తుతం 180 కేజీలు మాత్రమే ఉంది. అంటే జిల్లాలోని నేలల్లో నత్రజని, పొటాష్ మోతాదుఉండావల్సిన దాని కన్నా తక్కువగా.. భాస్వరం ఎక్కువ మోతాదులో ఉన్నట్లు స్పష్టం అవుతుంది. అదే విధంగా సూక్ష్మ పోషకాలు ఐరన్, జింక్, మాంగనీస్, బోరాన్ వంటివి తక్కువ మోతాదుల్లో ఉన్నాయి.

కారణాలు ఇవే..

భూమి సారంలో తేడా రావడానికి అనేక కారణాలు ఉన్నా.. ప్రధానంగా రైతుల స్వయంకృతాపరాధంతోనే ఎక్కువ నష్టం జరుగుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. గతంలో తొలకరి వర్షాలకు ముందుగానే పెంట మట్టి, చెరువు మట్టి వేసేవారు. కానీ ఇప్పుడు అది మరిచిపోయారు. తొలకరి వర్షాలు పడిన తర్వాత పెసర, నువ్వులు, జనుము మొదలైన పంటలు వేసే వారు. ఇప్పుడు ఆ పంటలు కానరావడం లేదు. పంటలను భూమిలో కలియ దున్నడం, గొర్రెలు, బర్రెల మందలు పెట్టేవారు. ఇప్పుడు అది లేదు. అదే విధంగా కాంప్లెక్స్ ఎరువులు డీఏపీ, 28-28, 24-24, 20-20, యూరియా వాడకం పెరిగింది. ధర ఎక్కువగా ఉందని పొటాష్ వాడకం తగ్గించారు. దీంతో నత్రజని, భాస్వరం, పొటాష్ తోపాటు సూక్ష్మ పోషకాల్లో కూడా వ్యత్యాసం వచ్చింది. దీంతో పంటలు సక్రమంగా ఎదగకపోవడం, పూత, కాత లేకపోవడం, వచ్చినా నిలువకపోవడం, పంట బలంగా ఉండకపోవడం, చీడపీడల బెడద ఎక్కువగా రావడంతో పంటల దిగుబడి తగ్గి రైతులు నష్టపోతున్నారు.

నేల స్వభావం తెలుసుకొని సాగు చేయాలి



ప్రతీ రైతుకు తన భూమిలోని పోషకాలపై అవగాహన ఉండాలి. పోషకాల మోతాదు తెలుసుకొని పంటలు వేయాలి. నేలను తక్కువ లోతుకు దున్నాలి. సేంద్రియ ఎరువుల వాడకం, పచ్చిరొట్ట పంటలు వేయడం పెంచాలి. పంటలను కాల్చి వేయకుండా నేలలోనే కలియ దున్నాలి. పంట పంటకు మార్పు చేయాలి. పోషకాల సమతుల్యంగా ఉండేలా చూసుకోవాలి.

- క్రాంతి కుమార్, కేవీకే మల్యాల శాస్త్ర వేత్త

జర్నలిస్టు 'కొమ్మినేని' అరెస్టు అప్రజాస్వామికం



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న జర్నలిస్టు సంఘాల నాయకులు, జర్నలిస్టులు

నెహ్రూసెంటర్: సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావును ఏపీ ప్రభుత్వం అరెస్టు చేయడం అప్రజాస్వామికమని, సాక్షి మీడియా కార్యాలయాలపై దాడులు సరికాదని జర్నలిస్టు సంఘాల నాయకులు అన్నారు. ఆయన అరెస్టును నిరసిస్తూ జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం మానుకోట పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో ప్లకార్డులు పట్టుకొని, నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన ధర్నా నిర్వహించారు. టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు చిత్తనూరి శ్రీనివాస్, టీయూడబ్ల్యూజే-143 జిల్లా కన్వీనర్ మద్దినేని గుట్టయ్య, తెలంగాణ స్టేట్ జర్నలిస్టు యూనియన్ జిల్లా అధ్యక్షుడు చిర్రగోని ఉదయ్‌ధీర్ మాట్లాడుతూ.. జర్నలిస్టులపై కక్షసాధింపు వైఖరి సరికాదన్నారు. ఏపీ ప్రభుత్వం సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావుపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా పని చేస్తున్న జర్నలిస్టుపై అక్రమ కేసులు పెట్టడం పత్రి కాస్వేచ్ఛకు గొడ్డలిపెట్టని పేర్కొన్నారు. శ్రీనివాసరావు అక్రమ అరెస్టును ప్రజాస్వామిక వాదులు ఖండించాలన్నారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జర్నలిస్టులు ఎంఏ ఫయాజ్, చందా శ్రీనివాస్, ఆకుల రమేశ్, పద్మం మహేశ్, బండారి జ్ఞానేందర్, వీరంటి ముఖేశ్, నూకల యశ్వంత్, గుండోజు సుబ్రహ్మణ్యం, గుండోజు దేవేందర్, కరుణాకర్, ఎర్రోజు అశోక్, దొంతు పురుషోత్తం, మాదాసు మహేశ్, గౌస్ పాషా, పసుపులేటి వెంకటేశ్వర్లు, రామరాజు ప్రవీణ్, ఆకుల నవీన్, తోకల రాంచంద్రు, శ్రీను, లావుడ్యా మనోహర్, కుమార్, బానోత్ శంకర్, గుంజె హన్మంతు, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకుడు సామ పాపయ్య, సాక్షి జర్నలిస్టులు ఈరగాని బిక్షం,అర్రం రమేశ్‌చందర్, బోనగిరి శ్రీనివాస్, గుజరాతి రాంప్రసాద్, చింతకుంట్ల యాకాంబ్రం, ఇరుకుళ్ల కిరణ్‌కుమార్, జిల్లెల్లమూడి మురళీమోహన్ పాల్గొన్నారు.

- మరిన్ని ఫొటోలు, వివరాలు 9లో▸

మాతా, శిశు మరణాలు తగ్గించాలి

● కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్



మాట్లాడుతున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్: జిల్లాలో మాతా,శిశు మరణాలను తగ్గించాలని, సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మాతాశిశు మరణాల నివారణపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీహెచ్‌సీ, సబ్‌సెంటర్ల వారీగా గర్భిణుల వివరాలు సేకరించాలన్నారు. హైరిస్క్ కేసులు ఉంటే ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి రెఫర్ చేయాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండి వైద్య సేవలు అందించాలన్నారు. డీఎంహెచ్‌ఓ రవిరాథోడ్, అధికారులు ఉన్నారు.

అత్యున్నత ప్రమాణాలతో విద్యా బోధన..

ప్రభుత్వ పాఠశాలల్లో అత్యున్నత ప్రమాణాలతో విద్యా బోధన జరుగుతుందని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో మంగళవారం డీఈఓ రవీందర్‌రెడ్డి అధ్యక్షతన ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధనపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. పండుగ వాతావరణంలో పాఠశాలల పునఃప్రారంభం చేయాలన్నారు.

పాఠశాలల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలి

పాఠశాలల్లో పారిశుద్ధ్య పనులు పూర్తిచేసి పునఃప్రారంభానికి సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం మండల ప్రత్యేక అధికారులతో కలెక్టర్ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆరోగ్యం, విద్య, న్యూట్రిషన్, శానిటేషన్‌పై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.

ప్రత్యేకాధికారుల బడి బాట

బడులు తెరిచే నాటికి సర్వం సిద్ధం చేసే పనిలో నిమగ్నం

● మండల ప్రత్యేకాధికారితో బృందం
● అన్ని పాఠశాలలకు వెళ్తున్న సభ్యులు



మరిపెడ మండలం కస్నాతండా పాఠశాల ఆవరణలో ఉన్న మొక్కల తొలగింపును పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి కిరణ్ కుమార్

సాక్షి, మహబూబాబాద్: వేసవి సెలవుల అనంతరం గురువారం పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ఇన్నిరోజులు జన సంచారం లేక అస్తవ్యస్తంగా మారిన పాఠశాలల్లో ప్రారంభం నాటికి అన్ని వసతులు, ఆహ్లాదకరమైన వాతావరణం, పండుగను తలపించే విధంగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ మంగళవారం ఉదయం ఆదేశించడంతో మండల ప్రత్యేకాధికారులు బడి బాట పట్టారు. పాఠశాలలను సుందరంగా తీర్చిదిద్దే పనిలో నిమగ్నమయ్యారు.


ప్రత్యేకాధికారితో టీమ్

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం, విద్యార్థుల సంఖ్యను పెంచాలని రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు చెబుతున్న నేపథ్యంలో జిల్లా అధికారుల దృష్టి విద్యాశాఖపై పడింది. ఇప్పటికే ఐదు రోజులుగా ఉపాధ్యాయులు బడి బాట పేరుతో విద్యార్థులను బడిలో చేర్పించే పనిలో ఉన్నారు. అయితే పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పించేందుకు ప్రత్యేక టీమ్ ఏర్పాటు చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పర్యవేక్షణ కోసం ఇప్పటికే ప్రతీ మండలానికి జిల్లా అధికారిని ప్రత్యేకాధికారిగా నియమించారు. ఇప్పుడు ఆ అధికారికి తోడుగా తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంఈఓతో కలిసి టీమ్ ఏర్పాటు చేశారు. ఈ టీమ్ మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలను పరిశీలించి బడి తెరిచే నాటికి సర్వం సిద్ధం చేయనున్నారు.

ప్రధాన సమస్యలు..

సెలవుల్లో ప్రభుత్వ పాఠశాలల గేట్లకు తాళాలు వేశారు. దీంతో పాఠశాల ఆవరణ పిచ్చిమొక్కలతో అపరిశుభ్రంగా తయారైంది. దీంతోపాటు తరగతి గదుల్లో దుమ్ము, ధూళి చేరింది. పలు పాఠశాలలకు సరైన గేట్లు లేకపోవడంతో ఆకతాయిలు వెళ్లి తాగునీటి పైపులైన్లు విరగకొట్టడం, ఫ్యాన్లు, లైట్లు తీసివేసిన సంఘటనలు ఉన్నాయి. ఈ పరిస్థితిని చక్కదిద్దేందుకు ప్రత్యేకాధికారితో కూడిన టీమ్ పాఠశాలలకు వెళ్తోంది. మంగళ, బుధవారాల్లో పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్ సరఫరా సక్రమంగా ఉండేలా చూడడం, ఆవరణలోని పిచ్చి మొక్కలు తీసేసి శుభ్రం చేయడం, మామిడాకుల తోరణాలు కట్టి పండుగ వాతావరణంలో పిల్లలకు స్వాగతం పలికేలా సర్వం సిద్ధం చేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

సీహెచ్‌సీలో మౌలిక వసతులు కల్పించాలి



సీహెచ్‌సీలో సమస్యలు వింటున్న హుస్సేన్‌నాయక్

గూడూరు: కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో అవసరమైన మౌలిక వసతులతో పాటు వైద్యులను నియమించాలని సూపరింటెండెంట్ వీరన్న కోరారు. మండల కేంద్రంలోని సీహెచ్‌సీని మంగళవారం జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ నాయక్ సందర్శించారు. ఆసుపత్రి పరిసర ప్రాంతాలను పరిశీలించి, లోపల వైద్య సేవల ఏర్పాట్లను పరిశీలించారు. ఆస్పత్రిలో ఏమైనా అవసరాలు ఉంటే చెప్పాలన్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ వీరన్న మాట్లాడుతూ.. ఆసుపత్రిలో మొత్తం 16 మంది వైద్యులు సేవలందించాల్సి ఉండగా, ఐదుగురు మాత్రమే ఉన్నారన్నారు. వైద్యుల నియామకానికి కృషి చేస్తానని హుస్సేన్‌నాయక్ అన్నారు. అదే విధంగా పాకాల వాగు సమీప పోస్టుమార్టం గది వద్ద విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలని, శవాలను భద్రపరిచేందుకు రెండు ఫ్రీజర్లు అవసరమని సూపరింటెండెంట్ చెప్పగా తప్పక ఏర్పాటు చేస్తానన్నారు. అనంతరం చెంద్రుగూడెంలోని ఏకలవ్య పాఠశాల నిర్మాణ పనులను హుస్సేన్‌నాయక్ పరిశీలించారు. కార్యక్రమంలో డీసీహెచ్‌ఎస్ వెంకట్రాములు, తహసీల్దార్ నాగభవాని, వైద్యులు పాల్గొన్నారు.

● యాసంగిలో ములుగు జిల్లా వెంకటాపురం, కన్నాయిగూడెం, వాజేడు, మండలాల్లోని 55 గ్రామాల్లో పేరొందిన కంపెనీలవని నమ్మిన రైతులు.. 1,370 ఎకరాల్లో మొక్కజొన్న వేశారు. అవి నకిలీవి కావడంతో 618 మంది రైతులు నష్టపోగా, అందుకు బాధ్యులైన వారిపై కేసులు నమోదయ్యాయి.

● గత మార్చి నెలాఖరులో హనుమకొండ జిల్లాలో రూ.78.63 లక్షల విలువ చేసే నకిలీ పత్తి విత్తనాలను పోలీసులను పట్టుకున్నారు. ఈ ముఠాసభ్యులు గతంలో కూడా నకిలీ పత్తి, మొక్కజొన్న విత్తనాలు విక్రయించినట్లు కేసులున్నాయి.

● తాజాగా వరంగల్ టాస్క్‌ఫోర్స్, గీసుకొండ, పరకాల పోలీసులు దాడులు నిర్వహించి ఏడుగురిని అరెస్టు చేసి రూ.63.62 లక్షల విలువ చేసే 166 కిలోల నకిలీ విత్తనాలు, 800 లీటర్ల గడ్డిమందు, నకిలీ పురుగుల మందు తయారీకి అవసరమైన సామగ్రి, 7 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు.

సీడ్.. ఫ్రాడ్..

రైతుల మెడపై నకిలీ విత్తనాల కత్తి

● సీజన్ ఆరంభం నుంచే దందా
● పత్తి విత్తనాల కృత్రిమ కొరత... తప్పని అధిక ధరల మోత
● పత్తి, వరి విత్తనాల్లోనే నకిలీ ఎక్కువ.. ఇటీవల పట్టుకున్న పోలీసులు
● నిఘా పెంచాలని కోరుతున్న రైతులు

జిల్లాల వారీగా పత్తిసాగు, విత్తనాల అంచనా

జిల్లా	సాగు అంచనా (ఎకరాల్లో..)	అవసరమయ్యే విత్తన ప్యాకెట్లు
హనుమకొండ	85,000	1,70,000
వరంగల్	1,22,358	2,44,716
మహబూబాబాద్	84,070	1,68,140
భూపాలపల్లి	1,01,500	2,03,000
జనగామ	1,45,000	2,90,000
ములుగు	29,430	58,860



వరంగల్ జిల్లాలో నకిలీ విత్తనాలు స్వాధీనం చేసుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు (ఫైల్)

సాక్షిప్రతినిధి, వరంగల్: ప్రస్తుత వానాకాలం సీజన్‌కు నకిలీ పత్తి విత్తనాలు పోటెత్తుతున్నాయి. ఓ వైపు మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, గుజరాత్ తదితర రాష్ట్రాలనుంచి భారీగా రవాణా అవుతుండగా.. మరోవైపు ముఠాలుగా ఏర్పడిన కొందరు ఉమ్మడి వరంగల్‌వాసులు ఈ 'నకిలీ'లను మార్కెట్లో విక్రయిస్తున్నారు. హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్ జిల్లాలను కేంద్రాలుగా చేసుకొని ఈ దందా సాగిస్తున్నారు. వరంగల్ కమిషనరేట్ పరిధిలో ముందు జాగ్రత్తగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు జరిపిన దాడుల్లో బయటపడిన నకిలీ విత్తనాలే ఇందుకు ఉదాహరణ.

వరి తర్వాత పత్తివైపే రైతుల మొగ్గు..

ఉమ్మడి వరంగల్‌లో వరి తర్వాత రైతులు పత్తి సాగుపైనే ఆసక్తి చూపుతున్నారు. గత వానాకాలంలో 15,83,692 ఎకరాల్లో వివిధ పంటలు వేశారు. ఇందులో 8.72 లక్షల ఎకరాల్లో వరి పంటలు వేయగా, 6.17 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. సుమారుగా 1.14 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న, శనగ, పెసర తదితర పంటలు సాగయ్యాయి. గత వానాకాలం సాగు విస్తీర్ణాన్ని పరిగణనలోకి తీసుకున్న వ్యవసాయశాఖ.. ఈ సీజన్‌లో 15.85 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యే అవకాశం ఉందని, ఇందులో 9.02 లక్షల ఎకరాల్లో వరి, 5.67 లక్షల ఎకరాల్లో పత్తి పంటలు వేస్తారని అంచనా వేసింది. పత్తి వర్షాధార పంట కావడంతో ఈ నెల రెండు, మూడు వారాల్లో విత్తుకునేందుకు 20 రోజుల ముందునుంచే విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు. ఈ మేరకు 5.67 లక్షల ఎకరాల్లో పత్తి సాగు కోసం ఎకరానికి రెండు బస్తాల చొప్పున సుమారు 11,34,716 ప్యాకెట్లు అవసరం. ఉమ్మడి జిల్లాలో ఎక్కువగా బీటీ-2 రకం వాడకంలో ఉండగా, ఈసారి బీటీ-3 పేరిట వ్యాపారులు నకిలీ విత్తనాలను విక్రయిస్తున్నారు. దీంతో చాలా మంది రైతులు విత్తనాల కొనుగోలులో సతమతమవుతున్నారు.

బ్లాక్ మార్కెట్‌లో విత్తనాలు.. రూ.400 వరకు అదనం..

ఉమ్మడి జిల్లాలో ఈసారి 5,67,358 ఎకరాల్లో పత్తి సాగవుతుందని అంచనా వేసిన వ్యవసాయశాఖ అధికారులు.. ఆ మేరకు విత్తనాలు అందుబాటులో ఉన్నాయని చెబుతున్నారు. కానీ ఓవైపు నకిలీ బెడద.. మరోవైపు బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలు రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఎకరానికి 475 గ్రాములున్న విత్తన ప్యాకెట్లు రెండు అవసరం కాగా.. ఉమ్మడి జిల్లాకు 11.35 లక్షల విత్తన ప్యాకెట్లు కావాల్సి ఉంది. ఈ మేరకు నిల్వలు ఉన్నాయని అధికారులు చెప్తున్నా... కొందరు డీలర్లు, వ్యాపారులు మాత్రం సరిపడా రాలేదంటున్నారు. బీటీ-2 రకాలకు మార్కెట్‌లో డిమాండ్ ఉండగా ఇప్పటినుంచే కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. కాగా బీటీ-2 రకాలకు చెందిన ఒక్కో ప్యాకెట్‌ను రూ.901లకు విక్రయించాల్సిన వ్యాపారులు లేవు.. లేవంటూ రూ.1,350 నుంచి రూ.1,450 వరకు అమ్ముతున్నట్లు చెబుతున్నారు. వర్షాలు పడితే ఆ ధరలు మరింత పెరిగే అవకాశం ఉన్నందున అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

మోసం చేసే వారిని కఠినంగా శిక్షించాలి



నాసిరకం విత్తనాలను అంటగట్టి మోసాలకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలి. మార్కెట్‌లోకి నకిలీ విత్తనాలు రాకుండా వ్యవసాయ, పోలీసుశాఖల అధికారులు చూడాలి. కొన్నిచోట్ల నకిలీ విత్తనాలు వెలుగు చూడడం ఆందోళన కలిగిస్తోంది. విత్తన దుకాణాలపై క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించి నాణ్యమైన విత్తనాలను విక్రయించేలా చూడాలి.

- మ్యాకల యాదయ్య, రైతు, పీచర, వేలేరు మండలం

నకిలీ విత్తనాలను అరికట్టాలి..



మార్కెట్లోకి నకిలీ విత్తనాలు రాకుండా అధికారులు చర్యలు చేపట్టి రైతులకు నాణ్యమైన పత్తి విత్తనాలు అందించాలి. ముందస్తు వర్షాలు పడడంతో పత్తి విత్తనాలు వేసేందుకు భూమిని సిద్ధం చేశాం. ప్రతి ఏటా నకిలీ విత్తనాలు మార్కెట్‌లోకి వస్తుండడంతో రైతులం నష్టపోతున్నాం. నకిలీ, అసలు విత్తనాలకు తేడా తెలియక ఆందోళనకు గురవుతున్నాం. వీటిపై అవగాహన కల్పించాలి.

- ముంజ సాంబయ్య, రైతు, వెంకటాపురం (ఎం), ములుగు జిల్లా

నకిలీ విత్తనాలు, మందులు విక్రయిస్తే కఠిన చర్యలు



నకిలీ విత్తనాలు, పురుగు మందులు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.ఎవరైన వ్యాపారస్తులు,సంస్థలు, వ్యక్తులు రైతన్నను మోసం చేస్తూ నకిలీ విత్తనాలను,పురుగు మందులు విక్రయిస్తే పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేస్తాం.ఇందుకోసం ప్రత్యేక ప్రణాళిక రూపొందించి టీమ్‌లను రంగంలోకి దింపాం. నకిలీల సమాచారం తెలిస్తే తక్షణమే మాకు అందించాలి. వివరాలు గోప్యంగా ఉంచుతాం.

- సన్ ప్రీత్‌సింగ్, పోలీస్ కమిషనర్, వరంగల్ కమిషనరేట్

క్లుప్తంగా

డెహ్రాడూన్‌కు ప్రత్యేక రైళ్లు

కాజీపేట రూరల్‌ : కాజీపేట జంక్షన్‌ మీదుగా చర్లపల్లి–డెహ్రాడూన్‌ మధ్య వారాంతపు ప్రత్యేక రైళ్ల సర్వీస్‌లు నడిపిస్తున్నట్లు కాజీపేట రైల్వే అధికారులు మంగళవారం తెలిపారు.

ప్రత్యేక రైళ్ల సర్వీస్‌ల వివరాలు..

ఈ నెల 17, 24వ తేదీల్లో చర్లపల్లి–డెహ్రాడూన్‌ (07077) ఎక్స్‌ప్రెస్‌ ప్రతీ మంగళవారం ఉదయం 6.23 గంటలకు కాజీపేట జంక్షన్‌కు చేరుకుంటుంది. ఈ నెల 12,19, 26వ తేదీల్లో డెహ్రాడూన్‌ –చర్లపల్లి(07078) ఎక్స్‌ప్రెస్‌ ప్రతీ శుక్రవారం ఉదయం 7 గంటలకు కాజీపేట జంక్షన్‌కు చేరుకుంటుంది. ఉమ్మడి వరంగల్‌ జిల్లా నుంచి ఉత్తర, దక్షిణ భారతదేశ పర్యాటక కేంద్రాలకు వెళ్లే పర్యాటకులకు ఈ రైళ్ల సర్వీస్‌లు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ రైళ్ల సర్వీస్‌లకు కాజీపేట, రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లి, సిర్పూర్‌కాగజ్‌నగర్‌, బల్లార్షా, నాగ్‌పూర్‌, ఇటార్సీ, రాణి కమలాపతి, భీనా, ఝాన్సీ, ఆగ్రా, మధుర, హజ్రత్‌నిజాముద్దీన్‌, మీరట్‌, రూర్కి, హరిద్వార్‌ రైల్వే స్టేషన్లలో హాల్టింగ్‌ కల్పించినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

కరీంనగర్‌ కలెక్టర్‌ను కలిసిన యశ్వంత్‌



కరీంనగర్‌ కలెక్టర్‌ పమేలా సత్పతికి మొక్క అందజేస్తున్న భూక్య యశ్వంత్‌

మరిపెడ రూరల్‌: మహబూబాబాద్‌ జిల్లా మరిపెడ మండలం భూక్యతండా గ్రామ పంచాయతీకి చెందిన మౌంటైనర్‌ భూక్య యశ్వంత్‌ మంగళవారం కరీంనగర్‌ కలెక్టర్‌ పమేలా సత్పతిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా యశ్వంత్‌.. కలెక్టర్‌కు మొక్క అందించాడు. ఎల్లప్పుడు ప్రభుత్వ ప్రోత్సాహం, ఆశీస్సులు ఉంటాయని, విజయం వైపు దూసుకెళ్లాలని కలెక్టర్‌ సత్పతి ఈ సందర్భంగా యశ్వంత్‌కు సూచించారు. ప్రపంచంలోనే ఎత్తైన పర్వతాలను ధృడసంకల్పంతో అధిరోహించి భారతదేశ ఖ్యాతిని యావత్‌ ప్రపంచానికి చాటాలని యశ్వంత్‌కు తెలిపారు.

రెండో రోజు విద్యుత్‌ కొనుగోలు ఒప్పందం

హన్మకొండ: 'పీఎం కుసుం' పథకంలో భాగంగా రైతులతో ఏర్పాటు చేయనున్న సోలార్‌ పవర్‌ ప్లాంట్‌ విద్యుత్‌ కొనుగోలు ఒప్పందం మంగళవారం రెండో రోజు కొనసాగింది. హనుమకొండలోని టీజీ ఎన్పీడీసీఎల్‌ కార్యాలయంలో ఎన్పీడీసీఎల్‌ ఐపీసీ అండ్‌ రాక్‌ చీఫ్‌ ఇంజనీర్‌ వెంకటరమణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కంపెనీ పరిధిలోని 16 సర్కిళ్ల నుంచి రైతులు చేరుకున్నారు. 461 మందికి రెడ్‌కో లెటర్‌ ఆఫ్‌ అక్సెప్టెన్సీ జారీ చేయగా సోమవారం మొదటి రోజు ఇరువురి మధ్య 37.50 మెగావాట్లకు చెందిన 38 ఒప్పందాలు జరిగాయి. రెండో రోజు దాదాపు 45 మెగావాట్లకు చెందిన 47 ఒప్పందాలు జరిగాయి. జూలై 7 వరకు పవర్‌ పర్చేజ్‌ ఒప్పందాలు చేసుకోవచ్చని రెడ్‌కో హనుమకొండ, జనగామ, భూపాలపల్లి జిల్లా మేనేజర్‌ మహేందర్‌ రెడ్డి తెలిపారు. పవర్‌ పర్చేజ్‌ అగ్రిమెంట్‌పై రైతులతో పాటు ఎన్పీడీసీఎల్‌ నుంచి ఐపీసీ అండ్‌ రాక్‌ చీఫ్‌ ఇంజనీర్‌ సంతకాలు చేశారు.



క్రీడా పాఠశాల పిలుస్తోంది..

స్పోర్ట్స్‌ స్కూళ్లలో ప్రవేశాలు
- హకీంపేట, కరీంనగర్‌, ఆదిలాబాద్‌లో పాఠశాలలు
- ఒక్కో స్కూల్‌లో 40 మంది బాలురు, 40 మంది బాలికలకు అవకాశం



భూపాలపల్లి అర్బన్‌ : విద్యార్థులకు చదువు ఎంతో ముఖ్యమో క్రీడలూ అంతే ముఖ్యం. అందుకే చిన్నప్పటి నుంచే ఈ రెండు రంగాల్లో రాణించాలి. అప్పుడే ప్రభుత్వ కొలువులు, ఇతర లక్ష్యాలు నెరవేరుతాయి. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్రంలోని మూడు క్రీడా పాఠశాల్లో 2025–26 విద్యా సంవత్సరానికి గాను 4వ తరగతిలో ప్రవేశాలకు నోటిఫికేషన్‌ విడుదలైంది. ఆసక్తిగల విద్యార్థులు స్పోర్ట్స్‌ స్కూల్‌లో సీటుసాధిస్తే అత్యుత్తమ క్రీడాకారులుగా రూపుదిద్దుకునే అవకాశం ఉంటుంది. భవిష్యత్‌లో స్పోర్ట్స్‌ కోటాలో ప్రభుత్వ కొలువులు సాధించొచ్చు. ఈనేపథ్యంలో స్పోర్ట్స్‌ స్కూల్‌లో ప్రవేశాలు ఎలా చేసుకోవాలి? ఎప్పుడు జరుగుతాయి? ఎలాంటి టెస్టులు పెడతారు? ఏ ప్రాంతంలో పెడుతారు అనే విషయాలపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

ఎంపిక విధానం..

రాష్ట్రంలోని మూడు ప్రాంతీయ క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు ఎంపిక పోటీల తేదీలను జిల్లా స్థాయిలో స్పోర్ట్స్‌ స్కూల్‌ అధికారులు ప్రకటించారు. మేడ్చల్‌ జిల్లాలోని హకీంపేటలో, కరీంనగర్‌, ఆదిలాబాద్‌ జిల్లాల్లో క్రీడా పాఠశాలలు ఉన్నాయి. విద్యార్థులకు కొన్ని శారీరక సామర్థ్యంతో పాటు పలు టెస్టులు నిర్వహించి ఎంపిక చేస్తారు. ఎవరైతే ఎక్కువ స్కోర్‌ సాధిస్తారో వారికి ప్రవేశం కల్పిస్తారు. రాష్ట్రంలో మూడు స్కూళ్లు ఉండగా 40 మంది బాలురు, 40 మంది బాలికలకు అవకాశం ఉంటుంది. జిల్లా కేంద్రంలో విద్యార్థులకు శారీరక సామర్థ్యానికి సంబంధించిన పరీక్షలు మండల, జిల్లాస్థాయిలో నిర్వహించి రాష్ట్రస్థాయి ఎంపికలకు పంపిస్తారు.

మండల స్థాయి పోటీలకు..

మండలస్థాయి ఎంపిక పోటీలకు హాజరయ్యే విద్యార్థులు పాఠశాల హెచ్‌ఎంతోపాటు మున్సిపాలిటీ, పంచాయతీకి సంబంధించిన వయసు ధ్రువీకరణ పత్రాలు వెంటతెచ్చుకోవాలి. అలాగే, రెండు పాస్‌పోర్టు సైజ్‌ ఫొటోలు 3వ తరగతి పాస్‌ సర్టిఫికెట్లతో మండల స్థాయి ఎంపిక పోటీలకు హాజరుకావాలి.

మండల స్థాయిలో ఎంపికలు..

ఈ నెల 16 నుంచి 19వ తేదీ వరకు ఎంఈఓ ఆధ్వర్యంలో ఎంపిక పోటీలు నిర్వహిస్తారు. ఇందులో విద్యార్థులు శారీరక సామర్థ్య పరీక్షల్లో కనీసం 10 పాయింట్లు స్థాయిస్తే జిల్లా స్థాయికి పంపిస్తారు. జిల్లాలోని అన్ని మండలాల కేంద్రాల్లో ఎంపిక పోటీలు నిర్వహించనున్నారు.

జిల్లా స్థాయిలో ..

ఈ నెల 23న జిల్లా కేంద్రాల్లో జిల్లా క్రీడాశాఖ అధికారుల ఆధ్వర్యంలో ఎంపిక పోటీలు నిర్వహిస్తారు. ఇందులో విద్యార్థులు శారీరక సామర్థ్య పరీక్షల్లో కనీసం 10 పాయింట్లు సాధిస్తే 10 మంది బాలురు, 10 మంది బాలికలను రాష్ట్ర స్థాయికి పంపిస్తారు.

రాష్ట్రస్థాయిలో ఎంపికలు..

- జూలై 1వ తేదీన హకీంపేట స్పోర్ట్స్‌ స్కూల్‌లో రాష్ట్రస్థాయి ఎంపిక పోటీలు నిర్వహిస్తారు. జూలై రెండో వారంలో ప్రవేశాలు నిర్వహిస్తారు.

అర్హతలు..

- 4వ తరగతిలో ప్రవేశాలు పొందగోరే విద్యార్థులు సెప్టెంబర్‌ 1, 2016 నుంచి ఆగస్టు 31, 2017 మధ్య జన్మించి ఉండాలి.

అనర్హులు వీరే..

- దొడ్డు కాళ్లు, ఫ్లాట్‌ఫీట్‌, వెన్నుముక వంగి ఉన్నవారు, గుండె సంబంధిత బాధితులు, బౌలెగ్స్‌ ఉన్న వారు. అలాగే ఎక్కడైన ఎముకలు విరిగిన వారు కూడా అనర్హులు.

మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో నిర్వహించే శారీరక సామర్థ్య పరీక్షలు

- ఎత్తు, బరువు, 30 మీటర్ల ఫ్లైయింగ్‌ స్టార్ట్‌, స్టాండింగ్‌ బ్రాడ్‌ జంప్‌, 800 మీటర్ల రన్నింగ్‌, 6, 10 మీటర్ల షటిల్‌ రన్‌, మెడిసన్‌ బాల్‌ త్రో (కిలో బరువు), వర్టికల్‌ జంప్‌, ఫ్లెక్సీబిలిటీ టెస్ట్‌, (ముందుకు వంగి భూమిని తాకడం), మెడికల్‌ టెస్ట్‌.

సద్వినియోగం చేసుకోవాలి

క్రీడాకారులుగా ఎదగాలనే విద్యార్థులకు ఇది సువర్ణావకాశం. తెలంగాణ స్పోర్ట్స్‌ స్కూళ్లలో చదివి అంతర్జాతీయ స్థాయితోపాటు ఒలింపిక్స్‌ వంటి మెగా ఈవెంట్‌లో పాల్గొని సత్తా చాటిన క్రీడాకారులు ఎందరో ఉన్నారు. స్పోర్ట్స్‌ స్కూళ్లలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన శిక్షణ లభిస్తుంది. చిన్నారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

–రఘు డీవైఎస్‌ఓ, జయశంకర్‌భూపాలపల్లి

లడ్డూల మిస్సింగ్‌పై చర్యలేవీ!

- సరస్వతీనది పుష్కరాలు ముగిసి 21 రోజులు గడచినా తేలని లెక్కలు
- లెక్కల్లో 6వేల లడ్డూలు తక్కువ రావడంపై దేవస్థానంలో చర్చ
- ఔట్‌సోర్సింగ్‌ ఉద్యోగిపై వేటుకు రంగం సిద్ధం?



నిల్వ చేసిన లడ్డూ బాక్స్‌లు(ఫైల్‌)

కాళేశ్వరం: పన్నెండేళ్లకొకసారి వచ్చే సరస్వతీనది పుష్కరాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. రూ.35కోట్లు మంజూరు చేసి 12 రోజుల పాటు అట్టహాసంగా నిర్వహించింది. మే 15 నుంచి 26వ తేదీ వరకు నిర్వహించిన పుష్కరాలకు సుమారు 20లక్షలకుపైగా మంది భక్తులు హాజరయ్యారు. త్రివేణి సంగమంలో పుణ్య స్నానాలు చేసి శ్రీకాళేశ్వరముక్తీశ్వరుడిని దర్శించుకున్నారు. దర్శనం అనంతరం స్వామివారి లడ్డూ ప్రసాదం కొనుగోలు చేశారు. ఫలితంగా కాళేశ్వరాలయానికి రూ. 1.33 కోట్లు ఆదాయం సమకూరింది. అయితే ఓ ఔట్‌సోర్సింగ్‌ ఉద్యోగి వద్ద విక్రయించిన లెక్కల్లో ఆరు వేల లడ్డూలకు సంబంధించి తేడాలు రావడంతో దేవస్థాన ఈఓ మహేశ్‌ సదరు ఉద్యోగికి నోటీసు ఇచ్చి సంజాయిషీ ఇవ్వాలని కోరగా, అతడి నుంచి స్పందన లేదని తెలిసింది. 9న మరో నోటీసు ఇచ్చారు. దీంతో దేవస్థానంలో మరికొన్ని లడ్డూలకు సంబంధించిన స్టాక్‌లో లెక్కలు లభించినట్లు తెలిసింది. సదరు ఔట్‌సోర్సింగ్‌ ఉద్యోగిని లెక్కల్లో తక్కువ వచ్చిన లడ్డూలకు సంబంధించి రూ.2.38 లక్షల వరకు చెల్లించాలని దేవస్థానం అధికారులు నిర్ణయించారు. లేదంటే ఉద్యోగం నుంచి తొలగించడానికి రంగం సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. దీంతో నగదు చెల్లిస్తే తానే లడ్డూల నగదును తీసుకున్నట్లు అవుతుందని ఆ ఉద్యోగి డబ్బులు చెల్లించడానికి ససేమిరా అంటున్నట్లు తెలిసింది. లడ్డూల మిస్సింగ్‌ అంశంపై ఎవరిపై చర్యలు తీసుకుంటారో తెలియక దేవస్థానం సిబ్బంది అయోమయానికి గురవుతున్నారు.

లెక్క ప్రకారమే..

లడ్డూలు స్టోర్‌రూమ్‌ నుంచి విక్రయాలు జరిగే గది వరకు సంబంధిత ఇన్‌చార్జ్‌ లెక్క ప్రకారం సంబంధిత సదరు ఉద్యోగికి చేరవేస్తాడు. మధ్యలో చేరవేయడానికి వలంటీర్లు తీసుకెళ్తారు. వారి వద్ద ఏమైనా లెక్కలు తగ్గాయా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 12 రోజుల సీసీ పుటేజీని పరిశీలించి విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని భక్తులు పేర్కొంటున్నారు.

ప్రసాదం అందరికీ..

పుష్కరాల 12 రోజుల సమయంలో ఎండోమెంట్‌, రెవెన్యూ, ఇరిగేషన్‌, పోలీసు, పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్‌, టూరిజం శాఖలు, జర్నలిస్టులతో పాటు ప్రైవేట్‌ సంస్థల నుంచి సుమారు 3వేల మందికిపైగా విధులు నిర్వర్తించారు. వీరిలో కొంత మంది విధులు ముగిసిన తర్వాత ఒక్కొక్కరు రెండు –మూడు లడ్డూల ప్రసాదం తీసుకెళ్లారు. వారికి లడ్డూల విడిగా ఇచ్చేవారు. ఇక్కడ మిస్సయినవి మాత్రం సింగిల్‌ బాక్స్‌, డబుల్‌ బాక్స్‌ల్లో ఉండే లడ్డూలు. ఇలా ఎక్కడ లెక్కలు మిస్సింగ్‌ అయ్యాయో తెలియాల్సి ఉంది. పుష్కరాలు ముగిసి 21 రోజులు గడుస్తున్నా లెక్కలు తేలకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. ఎవరిని బాధ్యులను చేస్తారో అని దేవస్థానం ఉద్యోగులు ఆందోళన చెందుతున్నట్లు తెలిసింది. ఈవిషయమై కాళేశ్వరం దేవస్థానం ఈఓ శనిగెల మహేశ్‌ను ఫోన్‌లో సంప్రదించగా..6వేల లడ్డూలు లెక్కల్లో తక్కువ వచ్చాయన్నారు. అందులో కొంత లడ్డూలకు సంబంధించి లెక్కలు లభించాయన్నారు. మిగతా లడ్డూలకు సంబంధించిన నగదు చెల్లించాలని సదరు ఉద్యోగికి గడువు ఇచ్చినట్లు తెలిపారు.

రీజినల్‌ స్పోర్ట్స్‌ స్కూల్‌లో ప్రవేశాలకు ఎంపికలు

వరంగల్‌ స్పోర్ట్స్‌: హనుమకొండలోని జవహర్‌లాల్‌ నెహ్రూ స్టేడియం ఆవరణలోని రీజినల్‌ స్పోర్ట్స్‌ స్కూల్‌లో ప్రవేశాలకు మంగళవారం ఎంపిక పోటీలు ప్రారంభమయ్యాయి. గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్‌ అజీజ్‌ఖాన్‌ ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హనుమకొండను క్రీడా హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. విద్యార్థులు స్పోర్ట్స్‌ స్కూల్‌ను సద్వినియోగం చేసుకుని అంతర్జాతీయ స్థాయిలో రాణించాలన్నారు. హనుమకొండ డీవైఎస్‌ఓ గుగులోత్‌ అశోక్‌కుమార్‌ మాట్లాడుతూ అండర్‌ –10,12,14,16 బాలబాలికల విభాగాల్లో జిమ్నాస్టిక్స్‌, అథ్లెటిక్స్‌, రెజ్లింగ్‌, హ్యాండ్‌బాల్‌, స్విమ్మింగ్‌ క్రీడాంశాల్లో ఎంపికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రెండు రోజుల పాటు నిర్వహించే ఎంపిక పోటీలకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 300 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో స్పోర్ట్స్‌ అథారిటీ ఆఫ్‌ తెలంగాణ నుంచి పరిశీలకులుగా డాక్టర్‌ రవికుమార్‌, నర్సింగరావు, స్వర్ణలత, సంతోశ్‌, రెజ్లింగ్‌, హ్యాండ్‌బాల్‌ అసోసియేషన్ల రాష్ట్ర కార్యదర్శులు కరీం, పవన్‌, డీఎస్‌ఏ కోచ్‌లు నరేందర్‌, శ్రీమన్నారాయణ, రాజు, విష్ణువర్ధన్‌, వెంకటేశ్వర్లు, నవీన్‌కుమార్‌, రమేశ్‌, అఫ్జల్‌, జీవన్‌గౌడ్‌, శంకర్‌, దేవిక తదితరులు పాల్గొన్నారు.



మెడిసిన్‌ బాల్‌ విసురుతున్న విద్యార్థిని

సమస్యల అంతానికి పరిశోధనే ఆయుధం

- కేయూ వీసీ కె. ప్రతాప్‌రెడ్డి



మాట్లాడుతున్న వీసీ కె. ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్‌: సామాజిక సమస్యల పరిష్కారానికి పరిశోధనే ఆయుధమని, సమాజానికి ఉపయోగపడే పరిశోధనలపై దృష్టిసారించాలని కాకతీయ యూనివర్సిటీ వీసీ కె. ప్రతాప్‌రెడ్డి కోరారు. వారం రోజులుగా కేయూలోని పొలిటికల్‌ సైన్స్‌ విభాగంలో పరిశోధక విద్యార్థులకు పరిశోధనాపద్ధతులపై నిర్వహిస్తున్న అవగాహన తరగతులు మంగళవారం ముగిశాయి. ఈ ముగింపు సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సామాజిక శాస్త్రాల పరిశోధన ఎంతో కీలకమన్నారు. పరిశోధనల కోసం ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన బడ్జెట్‌,అలాగే పుస్తకాలు అందుబాటులో ఉంచేలా కృషి చేస్తానన్నారు. కేయూ ఎకనామిక్స్‌ రిటైర్డ్‌ ప్రొఫెసర్‌ ఎస్‌. విజయ మాట్లాడుతూ ఈ ఆధునిక సమాచార యుగంలో మానవుడు సేకరిస్తున్న సమాచారం పరిమితులు లేనిదన్నారు. అయితే సమాచారాన్ని గణనీయంగా ఉపయోగించేందుకు రెండు ముఖ్యమైన పద్ధతులు సహకరిస్తున్నాయన్నారు. కంటెంట్‌ అనాలిసిస్‌, డేటా ప్రదర్శన అన్నారు. ఇవి పరిశోధన, విద్యమాధ్యమం, వ్యాపారం వంటి రంగాల్లో ముఖ్యమైన సాధనాలుగా వెలుగొందుతున్నాయన్నారు. సమావేశంలో పొలిటికల్‌ సైన్స్‌ విభాగం అధిపతి సంకినేని వెంకటయ్య, కేయూ రిజిస్ట్రార్‌ వి. రామచంద్రం, యూనివర్సిటీ కాలేజీ ప్రిన్సిపాల్‌ టి. మనోహర్‌, బీఓఎస్‌ కృష్ణయ్య, అధ్యాపకులు వల్లకొండ సత్యనారాయణ, వి. నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

చోరీ సొత్తుతో ప్రియురాలితో జల్సాలు

ఇంటి దొంగను అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలింపు
- 24గంటల్లో కేసును ఛేదించిన పోలీసులు
- 11.116 తులాల బంగారం, బైక్‌, మొబైల్‌ ఫోన్‌ స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఏసీపీ నందిరామ్‌నాయక్‌



కేసు వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ నందిరామ్‌నాయక్‌

ఖిలా వరంగల్‌: చేసిన అప్పులు తీర్చేందుకు, ప్రియురాలితో కలిసి జల్సాలు చేసేందుకు ఏకంగా తన సొంత ఇంటికే కన్నం వేసిన ఓ ప్రబుద్ధుడు.. చివరికి పోలీసులకు చిక్కి కటకటాలపాలయ్యాడు. అతని నుంచి 11.116 తులాల బంగారం, బైక్‌, మొబైల్‌ ఫోన్‌ స్వాధీనం చేసుకున్నారు. వరంగల్‌ మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వరంగల్‌ ఏసీపీ నందిరామ్‌నాయక్‌.. ఇన్‌స్పెక్టర్‌ బొల్లం రమేష్‌, ఎస్సైలు శ్రీకాంత్‌, సురేష్‌లతో కలిసి కేసు వివరాలు వెల్లడించారు.

ప్రియురాలి కోసం సొంతింటికే కన్నం..

ఖిలా వరంగల్‌ పడమర కోటకు చెందిన గుర్రపు రామకృష్ణ ఆర్‌ఎంపీ వైద్యుడిగా పనిచేస్తున్నాడు. అతడికి భార్య సవితా రాణి, ఒక కుమార్తె శ్రీనిధి, కుమారుడు గుర్రపు జయంత్‌ ఉన్నారు. జయంత్‌ హనుమకొండలోని ఓ కళాశాలలో బీబీఏ ఫైనలియర్‌ చదువుతున్నాడు. అదే కాలేజీలో అతడికి ఒక గర్ల్‌ ఫ్రెండ్‌ ఉంది. ఆమెతో కలిసి జల్సాలు చేసేందుకు చేతిలో చిల్లి గవ్వలేదు. ఇంటికే కన్నం వేయాలని నిర్ణయించుకున్నాడు. సమయం కోసం చూస్తున్న అతను రామకృష్ణ.. తన తమ్ముడి (జయంత్‌కు బాబాయి) మనుమరాలు పుట్టినరోజు వేడుకల నిమిత్తం ఆదివారం ఉదయాన్నే హైదరాబాద్‌కు భార్య, కుమార్తెతో కలిసి వెళ్లారు. కానీ, జయంత్‌ ఇక్కడే ఉన్నాడు. అదేరోజు రాత్రి రామకృష్ణ ఇంటికి వచ్చి చూడగా బీరువా తెరిచి ఉండగా.. అందులోని ఆరున్నర తులాల పెద్ద హారం, ఐదున్నర తులాల చిన్నహారం, రెండు తులాల రెండు బంగారు గొలుసులు, రెండు తులాల నెక్లెస్‌, మొత్తం 16 తులాల ఆభరణాలు కనిపించకపోవడంతో చోరీ జరిగిందని గ్రహించి మిల్స్‌కాలనీ పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సెంట్రల్‌ జోన్‌ డీసీపీ సలీమా బేగం ఆదేశాలతో వరంగల్‌ ఏసీపీ నందిరామ్‌నాయక్‌ కేసును చాలెంజ్‌గా తీసుకున్నారు. ఇన్‌స్పెక్టర్‌ బొల్లం రమేష్‌, ఎస్సైలు శ్రీకాంత్‌, సురేష్‌ దర్యాప్తు ప్రారంభించారు. మంగళవారం ఉదయం 9గంటల సమయంలో ఫోర్ట్‌రోడ్డు జంక్షన్‌లో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా..గుర్రపు జయంత్‌ పోలీసులను చూసి పారిపోతుండగా అనుమానంతో అదుపులోకి తీసుకుని విచారించగా.. దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నాడు. అతని వద్ద 11.16 తులాల బంగారం స్వాధీనం చేసుకున్నారు.

అప్పులు తీర్చి.. మిగతా డబ్బులతో జల్సా..

జయంత్‌ బీబీఏ ఫైనలియర్‌ చదువుతూనే హైదరాబాద్‌లో 'స్టార్స్‌ ఓన్‌ వీల్స్‌' పేరుతో ఒక ఫుడ్‌ కోర్ట్‌ నిర్వహిస్తున్నాడు. వ్యాపారం కలిసిరాక అప్పులపాలయ్యాడు. జయంత్‌కు కాలేజీలో ఓ గర్ల్‌ఫ్రెండ్‌ ఉంది. చేసిన అప్పులు తీరాలన్నా.. గర్ల్‌ఫ్రెండ్‌తో జల్సాలు చేయాలన్నా డబ్బు కావాలనుకున్న జయంత్‌.. తన కుటుంబ సభ్యులు ఆదివారం హైదరాబాద్‌కు వెళ్లగానే ఇంట్లోని బంగారం ఆభరణాలు దొంగిలించాడు. ఆభరణాల్లో కొంత బంగారం కరిగించి అమ్ముదామని వెళ్తుండగా పోలీసులకు చిక్కాడు. అతడినుంచి 5.645 తులాల బంగారు హారం, 5.471 తులాల కరిగించిన బంగారం.. మొత్తం 11.116 తులాల బంగారం, బైక్‌, ఒక మొబైల్‌ ఫోన్‌ స్వాధీనం పర్చుకున్నారు. 24గంటల్లో కేసును ఛేదించిన ఇన్‌స్పెక్టర్‌ బొల్లం రమేష్‌, ఎస్సైలు శ్రీకాంత్‌, సురేష్‌, సిబ్బంది ప్రవీణ్‌రెడ్డి, వాజీద్‌ పాషా, నరేందర్‌, హోంగార్డ్‌ రఫీలను ఏసీపీ నందిరామ్‌నాయక్‌ అభినందించారు.

బంధువే హంతకుడు?

- వృద్ధురాలి హత్యకేసులో వెలుగులోకి నిజాలు
- బంగారం కోసమే హత్య
- పోలీసుల అదుపులో నిందితుడు

గీసుకొండ: గ్రేటర్‌ వరంగల్‌ నగరం 17వ డివిజన్‌ స్తంభంపల్లికి చెందిన వృద్ధురాలు పోచన స్వరూప (69) హత్యకేసు విషయంలో పలు విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఆదివారం తెల్లవారుజామున దుండగులు ఆమె తలపై డంబెల్స్‌తో మోదడంతో మృతి చెందిందని పోలీసులు ప్రాథమికంగా అంచనా వేశారు. ఈ ఘటనపై గీసుకొండ పోలీసులు, మామునూరు ఏసీపీ బి. వెంకటేశ్‌ ఆధ్వర్యంలో మూడు బృందాలుగా ఏర్పడి దర్యాప్తు జరిపారు. వరంగల్‌ మట్టెవాడలో ఉంటున్న మృతురాలి మేనల్లుడు ప్రణయ్‌ (చింటు..మృతురాలి చిన్న తమ్ముడి కుమారుడు) బంగారంతో పాటు భూములు అమ్మగా వచ్చిన డబ్బులను కాజేయాలనే ఉద్దేశంతో ఈ హత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. మృతురాలికి ఫోన్‌ చేసి తాను ఇంటికి వస్తున్నానంటూ చెప్పి వెళ్లినట్లు సమాచారం. అప్పటికే మద్యం మత్తులో ఉన్న అతడు స్వరూప తలపై మోది హత్య చేసి బంగారం, నగదు ఎత్తుకెళ్లినట్లు తెలుస్తోంది. అంతే కాకుండా తన బైక్‌ నంబర్‌, రంగు మార్చి వరంగల్‌కు వెళ్లినట్లు స్థానికులు చెబుతున్నారు. హంతకుడు తాగిన బీరు బాటిల్‌పై వేలిముద్రలు తీసుకున్న పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ప్రణయ్‌ మొబైల్‌ లొకేషన్‌ ట్రేస్‌ చేసి .. చివరికి ఇంటిలో ఉన్న అతడిని అదుపులోని తీసుకుని ప్రశ్నిస్తున్నట్లు తెలుస్తోంది. పూర్తి వివరాలు సేకరించిన అనంతరం ఈ కేసు విషయాలను పోలీసులు వెల్లడించే అవకాశం ఉంది.

ఆటోను ఢీకొన్న లారీ..


- అక్కడికక్కడే ఆటోడ్రైవర్‌ మృతి
- స్టేషన్‌ఘన్‌పూర్‌ బస్టాండ్‌ వద్ద ఘటన



రమేశ్‌ (ఫైల్‌)

స్టేషన్‌ఘన్‌పూర్‌: లారీ.. ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్‌ అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటన స్టేషన్‌ఘన్‌పూర్‌ బస్టాండ్‌ వద్ద జాతీయ రహదారిపై జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. హనుకొండ జిల్లా ధర్మసాగర్‌ మండలం ధర్మపురం గ్రామానికి చెందిన సింగారపు రమేశ్‌(42) ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈక్రమంలో మంగళవారం ఉదయం ఆటో నడుపుకుంటూ జనగామ నుంచి హనుమకొండకు వస్తున్నాడు. ఆటో స్టేషన్‌ఘన్‌పూర్‌కు రాగానే హైదరాబాద్‌ నుంచి కాళేశ్వరం వెళ్తున్న లారీ వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో రమేశ్‌కు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. గమనించిన స్థానికులు రమేశ్‌ కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. దీంతో హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య సుమ ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌ లింగస్వామిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జి.వేణు తెలిపారు. కాగా, ఆటోలో ప్రయాణికులు ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు పేర్కొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న ట్రైనీ ఐఏఎస్‌లు



ట్రైనీ ఐఏఎస్‌లకు ఆశీర్వచనం అందజేస్తున్న అర్చకులు

హన్మకొండ కల్చరల్‌/ఖిలావరంగల్‌: తెలంగాణ దర్శన్‌ కార్యక్రమంలో భాగంగా భద్రకాళి దేవాలయాన్ని మంగళవారం 2024 ట్రైనీ ఐఏఎస్‌లు సౌరభ్‌శర్మ, సలోని ఛబ్రా సందర్శించారు. ఆలయాన్ని సందర్శించిన ఐఏఎస్‌లను ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతించారు. అమ్మవారికి పూజలు నిర్వహించుకున్న అనంతరం అర్చకులు వారికి స్నపనమండపంలో తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు, మహదాశీర్వచనం అందజేశారు. ఆలయ చరిత్ర వివరించారు. అదేవిధంగా.. ఖిలా వరంగల్‌ కోటను ట్రైనీ ఐఏఎస్‌ అధికారులు సందర్శించారు. వారి వెంట రామ్‌రెడ్డి, కుమారస్వామి, శ్యామ్‌లాల్‌, పురావస్తుశాఖ కో–ఆర్డినేటర్‌ శ్రీకాంత్‌, టీజీ టీడీసీ ఇన్‌చార్జ్‌ అజయ్‌ పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

మామునూరు: ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం చెందిన ఓ వ్యక్తి.. గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్‌ ఆర్టీఏ జంక్షన్‌ లెనిన్‌నగర్‌ కాలనీకు చెందిన కస్తూరి కుమార్‌(55), అనిత దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ క్రమంలో కూలీ లేక ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం చెందిన కస్తూరి కుమార్‌ సోమవారం సాయంత్రం గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వరంగల్‌ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి బావమరిది రాంబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మామునూరు సీఐ రమేష్‌ తెలిపారు.

పింగిళి డిగ్రీ కాలేజీ సెమిస్టర్ల పరీక్షల ఫలితాలు విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్‌ చంద్రమౌళి, పరీక్షల విభాగం అధికారులు

విద్యారణ్యపురి: హనుమకొండలోని ప్రభుత్వ పింగిళి మహిళా కళాశాల (అటానమస్‌) డిగ్రీ కోర్సుల బీఏ, బీకాం, బీఎస్సీ ఫిజికల్‌ సైన్స్‌, బీబీఏ, బీసీఏ కోర్సుల రెండు, నాల్గవ, ఆరవ సెమిస్టర్‌ పరీక్షల ఫలితాలను మంగళవారం ఆ కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ బి.చంద్రమౌళి విడుదల చేశారు. రెండో సెమిస్టర్‌లో 497మంది విద్యార్థినులకు 251మంది (50.50శాతం), నాల్గవ సెమిస్టర్‌ పరీక్షల్లో 441మందికి 289మంది (65.53శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఆరవ సెమిస్టర్‌లో 419మందికిగాను 397మంది (94.75శాతం) విద్యార్థినులు పాసయ్యారు. ఫలితాలను కళాశాల వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చునని ప్రిన్సిపాల్‌ చంద్రమౌళి తెలిపారు. కార్యక్రమంలో కళాశాల పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్‌ సుహాసిని, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు కొలిపాక శ్రీనివాస్‌, రాజిరెడ్డి, ఏక్యూఏసీ కోఆర్డినేటర్‌ సురేష్‌బాబు, ఆయా విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్‌

EDUCATION

DISTANCE EDUCATION
- మావద్ద ఓపెన్‌ 10th, ఇంటర్‌, డిగ్రీ, పీజీ, MBA, MCA, B.Tech, LLB, ITI, డిప్లొమా, ఫార్మసి, B.Sc (Agree), HPT, B.Ed, B.PEd, అడ్మిషన్లకై సం.ప్ర. 99481 31154 [SCA 25004771]

SERVICES
- పద్మావతి ఫైనాన్స్‌: హౌసింగ్‌, బిజినెస్‌, మార్టిగేజ్‌, పర్సనల్‌, ఓపెన్‌ ప్లాట్స్‌పై రుణాలు ఇప్పించబడును. IT రిటర్న్స్‌, GST లైసెన్స్‌ చేయబడును. WGL. 9618767116. [SCA25004490]

DOCUMENT MISSING
- GURRAM SRIDHER, S/o. Padmaiah, H.No. 6-1-28/8/6/9, సూర్యాపేట రోడ్డు జనగాం టౌన్‌ & Dist గార్లవి ఒరిజినల్‌ ప్లాట్‌ డాక్యుమెంట్స్‌ నెం. 10498/2024 & లింక్‌ DOCT NO. 4538/2006 గల రిజిస్టర్డ్‌ డాక్యుమెంట్స్‌ తీసుకొని బైక్‌ పై సూర్యాపేట రోడ్‌ To జనగాం బస్టాండ్‌ కి వస్తుండగా పోయాయి. దొరికినవారు సంప్ర॥ 9989915499. [SCA25004817]

రెస్టారెంట్‌
- హోటల్‌ విహార గ్రాండ్‌: NGO's కాలనీ రోడ్‌, హన్మకొండ. టిఫిన్స్‌, రెస్టారెంట్‌, ఐస్‌ క్రీమ్స్‌, లగ్జరి రూమ్స్‌. సంప్ర: 9966600413, 9966600418 [SCA25004322]

CHANGE OF NAME
- I SYED PARVEEN BEGUM W/o KHAJA MEHARAJUDDIN (Old Name) H.No. 25-8-153, Bapuji Nagar, Kazipet, Hanamakonda. Dist. 506003. TG. I have changed my name from SYED PARVEEN BEGUM to "PARVEEN BEGUM W/o KHAJA MEHARAJUDDIN (New Name) for all purpose. [MW 13576]

LOANS
- శివబాలాజీ లోన్స్‌: స్లాబు, పెంకుటిల్లు, రేకుల కప్పు, టేకోవర్‌ లోన్స్‌, అన్ని రకాల వ్యాపారులకు లోన్స్‌, భవన నిర్మాణ కార్మికులకు Topup లోన్స్‌, సిబిల్‌ లేకున్నా, సిబిల్‌ బ్యాడ్‌ ఉన్నా లోన్స్‌ ఇవ్వబడును. WGL- 8522825358 [WA-6702]

BUSINESS SERVICES
- మీ బంగారం మణప్పురం ముత్తూట్‌, మర్వాడి షాప్స్‌ ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్న మాడబ్బుతో విడిపించి మార్కెట్‌ ధరకు కొనబడును. 9160077916 స్పాట్‌ క్యాష్‌ [HA-783417]

WANTED
- పెట్రోల్‌పంప్‌ & రైల్వే కన్‌స్ట్రక్షన్‌లో సివిల్‌ వర్క్‌ చేయుటకు సివిల్‌ ఇంజనీర్‌, సూపర్‌వైజర్‌ కావలెను. ప్లేస్‌ AP+TG. Cell: 9989606333, 9491474143. [SCA25004568]
- ప్రముఖ కార్పొరేట్‌ కంపెనీలో పనిచేయుటకు మార్కెటింగ్‌ & జనరల్‌ మేనేజర్స్‌ స్త్రీ/పు కావలెను. + vrs వారికి ప్రాధాన్యత. 9866137009, 9866194585. [SCA25004708]

WANTED TEACHERS
- Computer Teacher- 1, Accountant- 1, PET- 1, Interested Candidates can apply ZPHS Ontimamidipally (M), Inavole. Ph: 9014978552, 9908864606 [MW 13575]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

వరంగల్‌ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్‌ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్‌ భూపాలపల్లి : 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్‌ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్‌ చేసే వాటితో ఈ వారా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్‌ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్‌ / డిపాజిట్‌ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

4 లైన్ల క్లాసిఫైడ్‌ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము